ప్రజాశక్తి
ఆదివారం 23 జూన్ 2024
5
అనంతపురం



ఆర్థిక మంత్రుల సమావేశంలో పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-వజ్రకరూరు

ఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రులతో శనివారం నాడు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. ఇతర రాష్ట్రాల ఆర్థిక మంత్రులతో కలిసి ప్రీ బడ్జెట్ సమావేశ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.



కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్‌తో మాట్లాడుతున్న పయ్యావుల కేశవ్

కసాయి తండ్రి
కిరాతకం


- నార్పలలో అదృశ్యమైన చిన్నారి హత్య
- తండ్రే హంతకుడు..!
- భార్యపై అనుమానంతో కూతురి హత్య
- ఏమీ తెలియని వాడిలా పోలీసులకు ఫిర్యాదు

నాన్నంటే నమ్మకం..
నాన్నంటే ధైర్యం..
నాన్న తోడుగా ఉంటే బలం..
నాన్న కష్టాన్ని దూరం చేసే ఆయుధం..

ఏ కూతురికైనా నాన్నపైన ఉండే విశ్వాసం ఇది. తనకు ఏ కష్టం వచ్చినా క్షణాల్లో రెక్కలు కట్టుకుని వస్తాడనే భావన. బుడిబుడి అడుగులు వేసేప్పటి నుంచి పెళ్లై అత్తారింటికి వెళ్లినా నాన్న అనే కవచం కూతురికి ఆసరాగా ఉంటుంది. అలాంటిది ఓ వ్యక్తి కసాయిలా మారాడు. తండ్రి స్థానంలో ఉండి కిరాతకానికి తెగబడ్డాడు. కంటికి రెప్పలా చూసుకోవాల్సిన తండ్రే కాలయముడిలా మారాడు. భార్యపై అనుమానం, కక్షతో అభంశుభం తెలియని తన ఏడేళ్ల కూతుర్ని అత్యంత కిరాతకంగా హత్య చేశాడు. చిట్టితల్లి భవిష్యత్తుకు ఊయల కట్టాల్సిన వ్యక్తి చిన్నారిని బావిలో పడేసి ఊపిరి తీశాడు.



మృతి చెందిన చిన్నారి పావని (ఫైల్ ఫొటో)



బావిలో తేలియాడుతున్న చిన్నారి మృతదేహం

ప్రజాశక్తి-నార్పల

అనంతపురం జిల్లా నార్పల మండల కేంద్రంలో రెండు రోజుల క్రితం అదృశ్యం అయిన చిన్నారి ఘటన చివరకు విషాదాంతం అయ్యింది. తండ్రి చేతిలోనే హత్యకు గురై విగత జీవిగా బాలిక పాడబడ్డ బావిలో కన్పించింది. ఈ ఘటనతో ఒక్కసారిగా నార్పలలో విషాదఛాయలు అలముకున్నాయి. ఈ ఘటనకు సంబంధించి శింగనమల సిఐ శ్రీధర్, ఎస్ఐ సత్యనారాయణరెడ్డి వివరాలను పాత్రికేయులకు వెల్లడించారు. అనంతపురం జిల్లా నార్పల కొత్త బస్టాండ్ కాలనీలో నివాసం ఉంటున్న గణేష్ సోమలదొడ్డికి చెందిన అమలను ఏడేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. ఈ దంపతులకు కూతరు పావని(6), కుమారుడు హరినాథ్ గౌడ్(4) ఉన్నారు. గణేష్ ఆటోడ్రైవర్‌గా జీవనం సాగిస్తుండగా, అమల గృహిణి. కూతురు పావని నార్పల అంబేద్కర్ కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి చదువుతోంది. ఏడాది కాలంగా గణేష్ తన భార్యతో గొడవ పడుతున్నాడు. భార్యపై అనుమానంతో ప్రతి రోజూ ఏదో ఒక విధంగా ఆమెతో ఘర్షణ పడేవాడు. దీనికి తోడు తన కూతురు తనకు పుట్టలేదనే అనుమానం కూడా ఉంది. ఈ అనుమానంతోనే అతను కసాయిలా మారిపోయాడు.



కుమార్తెతో తండ్రి గణేష్ (ఫైల్ ఫొటో)

పాఠశాల నుంచి తీసుకెళ్లి బావిలో తోసేసి..

ఈ నెల 20వ తేదీ మధ్యాహ్నం గణేష్ తన కూతురు చదువుతున్న పాఠశాలకు వెళ్లి చిన్నారిని ఇంటికి వెళ్దామని చెప్పి తనపాటు ద్విచక్రవాహనంలో తీసుకెళ్లాడు. తండ్రి ఇంటికి తీసుకెళ్తున్నాడన్న ఆనందంలో చిన్నారి సంతోషంగా బైక్‌పై ఎక్కింది. అప్పటికే కూతురును చంపేయాలని నిశ్చయించుకున్న తండ్రి నార్పల సమీపంలోని ఓ పాడుబడ్డ బావి వద్దకు తీసుకెళ్లాడు. అక్కడకు తీసుకెళ్లాగానే పాపను కొట్టి అనంతరం నీటిలో పడేశాడు. అనంతరం ఏమీ తెలియని వాడిలా ఇంటికి వచ్చేశాడు. పాప ఎక్కడంటూ భార్య అమల గణేష్‌ను అడిగింది. అంగట్లో తినుబండారులు కొనేందుకు వెళ్లిందని, అప్పటి నుంచి ఇంటికి రాలేదని గణేష్ చెప్పాడు. దీంతో తల్లి ఆందోళనతో గాలింపు చేపట్టింది. అయినా పాప ఆచూకీ లభించలేదు.

ఏమీ తెలియని వాడిలా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు

తన కూతురు అంగట్లో తినుబండారులు కొనుగోలు చేసేందుకు వెళ్లి తరువాత ఇంటికి రాలేదని చెబుతూ పాప తండ్రి గణేష్ నార్పల పోలీసులకు పిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు చిన్నారి ఆచూకీ కోసం తిరిగారు. జిల్లా ఎస్పీ గౌతమిసాలి సైతం నార్పలకు వెళ్లి చిన్నారి తల్లిదండ్రులతో మాట్లాడారు. పోలీసులతో కలిసి తండ్రి గణేష్ కూడా వెతుకుతున్నట్లు నటించాడు. చిన్నారి గురించి పోలీసులు అడిగే అన్ని ప్రశ్నలకూ సమాధానం ఇస్తూ రెండు రోజుల పాటు వారికి ఏమాత్రం అనుమానం రాకుండా జాగ్రత్త పడుతూ వచ్చాడు.

బావి వద్ద తచ్చాడుతూ కన్పించడంతో..

కూతురిని చంపేసిన గణేష్ శనివారం ఉదయం పాప మృతదేహం నీటిలో తేలియాడుతోందేమోనని చూసేందుకు పాడుబడ్డ బావి వద్దకు వెళ్లాడు. ఇదే సమయంలో అటుగా వెళుతున్న పోలీసులకు గణేష్ కంటబడ్డాడు. అప్పటికే అనుమానంతో ఉన్న పోలీసులు అతన్ని పట్టుకున్నారు. ఎందుకు ఇంకడున్నావని ప్రశ్నిస్తే పొంతనలేని సమాధానం ఇచ్చాడు. దీంతో పోలీసులు తమదైన శైలిలో విచారిస్తే అసలు దుర్మార్గాన్ని అంగీకరించాడు. రెండు రోజుల క్రితం తానే కూతుర్ని బావిలో తోసేశానని, మృతదేహం నీటిలో తేలియాడుతుందేమోనని చూసేందుకు వచ్చానంటూ అసలు వాస్తవాలు తెలియజేశాడు. దీంతో విస్తుపోయిన పోలీసులు బావిలో గాలించగా ముళ్ల చెట్ల కింద చిన్నారి పావని మృతదేహం లభ్యం అయ్యింది.

అనుమానంతోనే హత్య

ఇటీవల గణేష్ తన భార్యపై అనుమానం పెంచుకున్నాడు. తన కూతురు తనకు పుట్టలేదనే భావన ఉంది. దీనికి తోడు ఇంట్లో తనమాటను భార్య ఏమాత్రం వినడం లేదనే అక్కసు కూడా ఉంది. వీటన్నింటి నేపథ్యంలో గణేష్ తన కూతుర్ని చంపితే భార్యపై కక్షసాధించవచ్చుని భావించి చిన్నారిని అమానుషంగా హత్య చేశాడు. ఇదే విషయాన్ని నిందితుడు పోలీసుల ఎదుట అంగీకరించాడు.


మిన్నంటిన రోదనలు

రెండు రోజులుగా అదృశ్యం అయిన చిన్నారి హత్యకు గురైందన్న విషయం తెలుసుకున్న ప్రజలు పెద్ద సంఖ్యలో పాడుబడ్డ బావి వద్దకు చేరుకున్నారు. చిన్నారి మృతదేహాన్ని బయటకు తీయడంతో కుటుంబ సభ్యులు, అక్కడున్న మహిళలు కన్నీటి పర్యవంతం అయ్యారు. ముక్కుపచ్చలారని చిన్నారని ఇంత కిరాతకంగా చంపడంపై ఆవేదన వ్యక్తం చేశారు. నిందితున్ని కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు.



సార్..మీ దగ్గర పని చేస్తాం..!

- అవకాశాల కోసం నేతల చుట్టూ ప్రదక్షిణలు
- సిఫార్సుల కోసం ముమ్మర ప్రయత్నాలు



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

సార్... సార్... నేను మీ వద్ద పనిచేస్తాను... అవకాశం ఇప్పించండి అంటూ అధికారపార్టీ నేతల చుట్టూ అధికారులు చక్కర్లు కొట్టడం మొదలైంది. ఇంతకు మునుపు అధికారంలో ఉన్న వైసిపికి అనుకూలంగా ఉంటూవచ్చిన అధికారులు తిరిగి ఇప్పటి అధికార పార్టీ టిడిపి నేతల చుట్టూ ప్రదక్షిణలు మొదలు పెట్టారు. అయితే గతంలో పనిచేసే ప్రాంతంలో కాకుండా పక్క నియోజకవర్గాల్లో అవకాశాల కోసం ప్రయత్నాలు చేసుకుంటూ ఉంటుండటం గమనార్హం. కొత్తగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల సిఫార్సు కోసం బారులుదీస్తున్నారు. ఆ ప్రజాప్రతినిధుల వద్ద ఉన్న ముఖ్య నేతలకు మంచి గిరాకీ ఏర్పడింది. వారిని ముందుగా ప్రసన్నం చేసుకునే పనిలోపడ్డారు. కులం.. ప్రాంతం ఇలా ఏదోక పేరు చెప్పి తాము అనుకున్న చోటుకు పోస్టింగ్‌ల కోసం ఇప్పటి నుంచే ప్రయత్నాలు మొదలు పెట్టారు. ముఖ్య ప్రజాప్రతినిధులు కూడా ఏ అధికారి అయితే బాగుంటుంది... ఎవరు తమకు అనుకూలమైన వారో ఆరా తీసే పనిలో పడ్డారు. కొత్త ప్రభుత్వం కొలువుదీరిన నేపథ్యంలో నెల రోజుల్లోపు అధికార యంత్రాంగాన్ని సెట్ చేసుకునే పనిలో ఎమ్మెల్యేలూ ఉన్నారు. మంత్రులు పూర్తి స్థాయి బాధ్యతలు తీసుకోగానే తమకు అనుకూలమైన అధికారులను నియమించుకునేలా ప్రజాప్రతినిధులు చూస్తున్నారు. ప్రధానంగా రెవెన్యూ, పోలీసు విభాగంపై ముందుగా దృష్టి పెట్టారు. గతంలో వైసిపి హయాంలో వీరు ఎక్కడ పనిచేశారు... ఎ రకంగా పనిచేసారన్నది కూడా ఆరా తీస్తున్నారు. ప్రధానమైన పోస్టుల్లో లేని వారు తమను అదే పనిగా అధికారపార్టీ పక్కనపెట్టిందని చెప్పి సానుభూతి ద్వారా తాము కోరుకున్న ప్రాంతానికి వచ్చేందుకు సిద్ధపడుతున్నారు.

ఆదాయ వనరులపైనా దృష్టి..!

ప్రజాప్రతినిధులు ఎక్కడ ఏ ఆదాయ వనరులున్నాయన్న దానిపై ఇప్పటి నుంచే ఆరాలు తీస్తున్నట్టు ప్రచారం నడుస్తోంది. ఒకటి, రెండు దగ్గర ఎక్కడైనా పనులు జరుగుతుంటే తక్షణం నిలిపేయాలన్న మౌఖిక ఆదేశాలు వెళ్లినట్టు సమాచారం. మరికొన్ని చోట్ల గతంలో వివాదాస్పద భూముల్లోనున్న అధికారపార్టీ నేతలను అక్కడి నుంచి పంపించే ప్రయత్నాలు నడుస్తున్నట్టు ఆరోపణలున్నాయి. సత్యసాయి జిల్లాలో ఈ రకంగా ఒకరిద్దరు నేతల ఇళ్లకు తాళాలు కూడా అధికార పార్టీ నేతలు వేసినట్టు ప్రచారం నడుస్తోంది. ఇక రేషన్ దుకాణాలైతే ఇప్పటి వరకు నిర్వహిస్తున్న డీలర్లకు ఆదేశాలు వెళ్లాయి. ఇక తమ పార్టీకి చెందిన వారు నిర్వహిస్తారని... వాటిని వదిలిపెట్టమన్న సంకేతాలు రావడంతో కొన్ని చోట్ల అనధికారికంగానే ఈ నెలలో రేషన్‌కు డబ్బులను అధికారపార్టీ నేతలే చెల్లిస్తున్నారు. అధికారులు కూడా దీనికి వ్యతిరేకంగా మాట్లాడితే సమస్య అవుతుందని మిన్నకుండిపోతున్నారు. మద్యం పాలసీపైనా అధికారపార్టీ నేతలు పెద్దఎత్తున ఆశలు పెట్టుకున్నారు. ఇప్పుడున్న విధానం కాదని, పాత పద్ధతిలోనే ప్రయివేటుకు అప్పగిస్తారని చెప్పడంతో దుకాణాలు అన్నింటినీ తామే దక్కించుకుకోవాలన్న ప్రయత్నాల్లో ఇప్పటి నుంచే ఉండటం గమనార్హం. ముఖ్య ప్రజాప్రతినిదులు కూడా వీటిపై దృష్టి సారించినట్టు తెలుస్తోంది. ఇలా అధికార మార్పిడితో అంతటా అలజడి మొదలైంది.

డయేరియా నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు

క్షేత్రస్థాయిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు - కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో డయేరియాతో ఏ ఒక్కరూ బాధపడకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అధికారులను ఆదేశించారు. శనివారం అనంతపురం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో డయేరియాపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ సూచనలను అనుసరించి ఆయా శాఖల జిల్లా అధికారులు వారి శాఖల పరిధిలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలన్నారు. డయేరియాపై అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. జిల్లాలో జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు డయేరియా ప్రభావం, ముందస్తు జాగ్రత్తలు, చేపట్టాల్సిన చర్యలపై స్టాప్ డయేరియా క్యాంపెయిన్ చేపట్టాలన్నారు. పిల్లలకు డయేరియా సోకకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. డిఎంహెచ్ఒ, డిసిహెచ్ఎస్‌లు నీటి పరిశుభ్రత, నీటి కాలుష్యం, తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి డయేరియా కేసులు అరికట్టేందుకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు. డయేరియాని అరికట్టేందుకు జిల్లాస్థాయిలో మున్సిపల్ కమిషనర్, జిల్లా పరిషత్ సీఈవో, డిఎంహెచ్ఒ, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ, డిసిహెచ్ఎస్, ఇతర జిల్లా అధికారులతో కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో మెడికల్ అధికారులు అందరూ అనునిత్యం అప్రమత్తంగా ఉండి డయారియా కేసులు, నీటి కాలుష్యంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పీహెచ్సీలు, సిహెచ్‌సిల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ ట్యాబ్లెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి క్లోరినేషన్ చేయాలన్నారు. జాతరలు, పెద్ద సంఖ్యలో సమావేశాలు నిర్వహించే స్థలాల్లో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, జిల్లా పరిషత్ సిఇఒ వైఖోమ్ నిదియా దేవి, డిపిఒ ప్రభాకర్ రావు, డిఎంహెచ్ఒ డా॥ఈబి.దేవి, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సివిఎస్ఎన్.మూర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహసాన్ బాషా, జిల్లా మలేరియా అధికారి ఓబులు, డిఐఒ యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

'ఎన్‌హెచ్ఎఐ' మేరకు నష్టపరిహారం

కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జాతీయ రహదారి 544-డికి సంబంధించి ఎన్‌హెచ్ఎఐ చట్టం ప్రకారం బోడిగానిదొడ్డి గ్రామస్తులకు నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం అనంతపురం కలెక్టరేట్లోని కలెక్టర్ ఛాంబర్‌లో జాతీయ రహదారి 544-డికి సంబంధించి బుక్కరాయసముద్రం మండలం బోడిగానిదొడ్డి గ్రామంలో భూ నష్టపరిహారం పంపిణీపై ఆర్బిట్రేషన్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 544-డి జాతీయ రహదారికి సంబంధించి బుక్కరాయసముద్రం మండలం బోడిగానిదొడ్డి గ్రామంలో సర్వేనెంబర్ 112-2లో 0.60 ఎకరాల భూమికి అవార్డు అయ్యాక నష్టపరిహారం అందించలేదని, గ్రామానికి చెందిన పట్టాదారులకు నష్టపరిహారం చెల్లించేందుకు ఈరోజు సమావేశం నిర్వహించామన్నారు. గ్రామానికి చెందిన భూమి, ఇళ్లు కోల్పోయిన పట్టాదారులతో మాట్లాడి వారికి ఏం కావాలో తెలుసుకుని ఎన్‌హెచ్ఎఐ పీడీ, ఆర్డీవో, తహశీల్దార్‌లతో చర్చించి ఎన్‌హెచ్ఎఐ చట్టం ప్రకారం వారికి నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, ఎన్‌హెచ్ఎఐ పీడీ తరుణ్ కుమార్, అనంతపురం ఆర్డీవో జి.వెంకటేష్, బుక్కరాయసముద్రం తహశీల్దార్, శింగనమల సబ్ రిజిస్టర్, బోడిగానిదొడ్డి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం


2025 సంవత్సరానికి సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కారం కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ వి.వినోద్ కుమార్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. విపత్తు నిర్వహణ రంగంలో వ్యక్తులు, సంస్థలు చేసిన అద్భుతమైన కృషిని గుర్తించేందుకు భారత ప్రభుత్వం "సుభాష్ చంద్రబోస్ ఆపద ప్రబంధన్ పురస్కార్" పేరుతో వార్షిక అవార్డును నెలకొల్పిందన్నారు. ఈ అవార్డులను సుభాష్ చంద్రబోస్ జయంతి రోజున ప్రతి సంవత్సరం జనవరి 23న ఒక సంస్థకు లేదా ఒక వ్యక్తికి అందజేస్తారన్నారు. వరుసగా రూ. 51 లక్షలు రూ.5 లక్షల నగదు పురస్కారాలను అందజేస్తారన్నారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను అందించేందుకు జులై 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు గడువు ఉంటుందన్నారు. ఆన్‌లైన్ దరఖాస్తు ఫారమ్ https://awards.gov.inలో అందుబాటులో ఉంటుందన్నారు. అర్హులైన వారు పూర్తి వివరాలతో దరఖాస్తులను నమోదు చేసుకోవాలని సూచించారు.

అనంత వైసిపి కార్యాలయానికి నోటీసులు

అక్రమ కట్టడాన్ని ఎందుకు కూల్చకూడదో వివరణ ఇవ్వాలి
డిప్యూటీ సిటీ ప్లానర్ హరిప్రసాద్ పేర నోటీసు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురంలోని హెచ్ఎల్‌సి కాలనీలో మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ నుంచి ముందస్తు అనుమతులు పొందకుండా నిర్మించిన జి ప్లస్ వన్ భవన ని భవనాన్ని ఎందుకు కూల్చకూడదో 7రోజుల్లోపు వివరణ ఇవ్వాలని, లేనిపక్షంలో కూల్చివేత ప్రక్రియ చేపడతామని డిప్యూటీ సిటీ ప్లానర్ ఎం.హరిప్రసాద్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునికి శనివారం నోటీసులు జారీ చేశారు. నోటీసులో హెచ్ఎల్‌సి కాలనీలోని 1.50 ఎకరాలో అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. నోటీసును సెక్షన్ 452 -1,, 461బి1 ఎపిఎంసి యాక్ట్ కింద జారీ చేశారు నోటీసులో పేర్కొన్న విధంగా వివరాలు ఇలా ఉన్నాయి ము ముందస్తు అనుమతులు పొందకుండ 136-ఐబిఐబిఎ2 జి ప్లస్ వన్ భవన నిర్మాణం చేపట్టారని పేర్కొన్నారు. భవన నిర్మాణానికి కావాల్సిన అనుమతులు పొందకుండానే చేపట్టిన నిర్మాణాలను ఎందుకు కూల్చి వేయకూడదో 7రోజుల్లోపు వివరణ ఇవ్వాలని కోరారు. నిర్దేశించిన గడువులోగా వివరణ ఇవ్వకుంటే భవంతిని ఉద్దేశపూర్వకంగానే అనుమతులు పొందకుండా నిర్మాణం పనులు చేపట్టారని భావించాల్సి వస్తుందన్నారు. అంతేగాకుండా సదరు అక్రమ కట్టడాన్ని 452-2,461-2 ఆఫ్ ఎపిఎంసి యాక్ట్ తదుపరి చర్యలు చేపడతామని నోటీసులో పేర్కొన్నారు.



Anantapur Municipal Corporation

PROVISIONAL ORDER

NOTICE UNDER SECTION 452(1) AND 461(1) OF APMC ACT 1955
AND
UNDER SECTION 89(1 & 2)R/W SECTION 82,90(1) OF APMR & UDA ACT 2016
(Act 5 of 2016)

Notice No: 01/1001/ATP/UC/TP/2024 Date: 22/06/2024.

Sub:
Anantapur Municipal Corporation - Town Planning Section - unauthorized construction of YSR Congress Party office Situated at HLC colony area an extent of Ac 1.50 Cents in Syno:136-1B1B2A2 of Anantapur - Notice Under Section 452(1) & 461 (1) OF APMC ACT -Issued-Regarding.

***

It is brought to the notice of the undersigned that an unauthorized construction is being taken by YSR Congress Party which is Situated at HLC colony area, Anantapur Municipal Corporation Limits, contrary to the provision of APMC Act and APMR & UDA Act, Bye-Laws made there under as given below.

Details of the unauthorized construction:

New Unauthorized Construction of G+1 in Syno: 136-1B1B2A2

Therefore, YSR Congress Party president is given this provisional order and hereby directed to stop further construction forthwith and show sufficient cause as to why the unauthorized construction should not be removed/altered or pulled down within 7 days from the date of receipt of this notice. Failing Which, it will be treated as a continuous and intentional offence and further action will be taken as per the provisional laid down under section 452(2) & 461 (2) OF APMC Act.

Deputy City Planner,
Anantapur Municipal Corporation

To,
The President,
YSRCP Office,
HLC Colony,
Anantapuramu.

అధికారులు జారీ చేసిన నోటీసు

పూర్వ విద్యార్థులే కళాశాలకు పట్టుకొమ్మలు

యుపిఎస్‌సి మాజీ సభ్యులు వై.వెంకటరామిరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

పూర్వ విద్యార్థులే జెఎన్‌టియు కళాశాలకు పట్టుకొమ్మలు అని పూర్వ విద్యార్థి, మాజీ యుపిఎస్‌సి సభ్యులు వై.వెంకటరామిరెడ్డి అన్నారు. శనివారం అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో 1994-98లో సివిల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం స్థానిక వర్శిటీ ఎన్టీఆర్ ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో పాల్గొనడం తమ అదృష్టమన్నారు. పూర్వ విద్యార్థులు కళాశాలకు పట్టుకొమ్మల్లాంటి వారన్నారు. ఇప్పుడు చదువుతున్న విద్యార్థులకు మీ అనుభవాలు మీ సలహాలు, సూచనలు ఎప్పటికీ ఉండాలని కోరారు. రిజిస్ట్రార్ సి.శశిధర్ మాట్లాడుతూ ఈ కళాశాలలో విద్యనభ్యసించిన అనేక మంది ఉన్నత పదవుల్లో ఉన్నారన్నారు. అలాంటి వారితో కలిసినప్పుడు కలిగే అనుభూతి మరువలేనిదన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌వి.సత్యనారాయణ మాట్లాడుతూ ఈ కళాశాలలో చదివిన వారు అనేక గొప్ప గొప్ప పదవుల్లో ఉన్నారన్నారు. పూర్వ విద్యార్థులు చాలా నిబద్ధత కలిగిన కొనియాడారు. అనంతరం పూర్వ విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అల్యూమిని డైరెక్టర్ పి.సుజాత, సి.శోభబిందు, వైస్ ప్రిన్సిపాల్ ఇ.అరుణకాంతి, ఎస్.కృష్ణయ్య, హెచ్.సుదర్శన్‌రావు, జి.మమత, కెఎఫ్.భారతి, అజిత, కళ్యాణి రాధా, మాజీ ఆచార్యులు వి.శంకర్, బి.దిలీప్, పూర్వ విద్యార్థులు మల్లికారెడ్డి, మనీష్ పంపత్వార్, సాయికిరణ్, కిరణ్ నల్లగొండ, రామకృష్ణ భరద్వాజ్, బి.ప్రసాద్, ఎన్.సతీష్, వి.చంద్రమౌళి, ఎల్.హరి, బి.మిథున్‌గోపాల్, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



ఒకచోట చేరిన జెఎన్‌టియు పూర్వ విద్యార్థులు

పచ్చదనంతోనే పర్యావరణ సమతుల్యం

సమగ్ర శిక్ష ఎపిసి వైకోమ్ నిధియాదేవి



మొక్కలు నాటిన సమగ్ర శిక్ష ఎపిసి వైకోమ్ నిధియాదేవి, అధికారులు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

విరివిగా మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారానే పర్యావరణ సమతుల్యం సాధ్యమని సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్టు సమన్వయకర్త వైకోమ్ నిదియాదేవి సూచించారు. శనివారం స్థానిక సమగ్ర శిక్ష కార్యాలయంలో ఎపిసి ఆధ్వర్యంలో సమగ్రశిక్ష ఉద్యోగులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరువు జిల్లాలో విరివిగా మొక్కలు పెంచాలన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల ప్రాంగణాల్లో మొక్కలు నాటేలా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు మొక్కల పెంపకంపై విద్యార్థుల్లో ఆసక్తిని పెంపొందించాలన్నారు. నీడనిచ్చి పచ్చదనాన్ని పెంపొందించే మొక్కలతోపాటు పశుపక్షాదులకు ఫలాలను అందించే వృక్షాలను కూడా నాటాలన్నారు.

సమగ్ర శిక్ష కార్యాలయ ప్రాంగణంలో శనివారం 50కిపైగా మొక్కలను నాటినట్లు తెలిపారు. చింత, వేప, సీతాఫలం, నేరేడు, కానుగ తదితర 50కిపైగా మొక్కలు నాటినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

బాలుడికి పాముకాటు.. కనిపించని లక్షణాలు

సాధారణ లక్షణాల కంటే భిన్నమైన సమస్యలు.. - సరైన చికిత్సతో కాపాడిన పిల్లల వైద్యుడు డాక్టర్ మహేష్

ప్రజాశక్తి-అనంతపురం



వైద్యం వివరాలను వెల్లడిస్తున్న బాలుడు తల్లిదండ్రులు

సాధారణంగా పాము కాటు వేస్తే నోటి వెంట నురగలు రావడం, నరాలకు సంబంధించిన సమస్యలు బయటపడటం లాంటివి ఉంటాయి. కానీ ఇలాంటి లక్షణాలేమీ లేకుండా.. మామూలుగా కడుపునొప్పి, వాంతులు మాత్రమే ఉంటే దాన్ని పాముకాటుగా తల్లిదండ్రులే కాదు, సాధారణ వైద్యులు కూడా గుర్తించలేరు. సరిగ్గా ఇలాంటి ఘటనే అనంతపురంలో జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలను పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఎ.మహేష్ ప్రజాశక్తికి వివరించారు.

12 ఏళ్ల బాలుడు ఊపిరి సరిగా అందని పరిస్థితిలో అనంతపురంలోని కిమ్స్ సవీరా ఆస్పత్రికి తీసుకొచ్చారు. అప్పటికి అతడి ఆక్సిజన్ శాచ్యురేషన్ కేవలం 66 శాతం మాత్రమే ఉంది. చెస్ట్ ఎక్స్‌రే తీసి చూస్తే, న్యుమోనియా లక్షణాల లాంటివి కొన్ని కనిపించాయి. కానీ ఒకరోజు ముందు వరకూ బాబుకు ఎలాంటి ఇబ్బందీ లేదు. అంటే న్యుమోనియాలో కనిపించే జ్వరం, దగ్గు, జలుబు లాంటివి ఒక్కటి కూడా లేవు. కానీ ఆక్సిజన్ శాచ్యురేషన్ బాగా తక్కువగా ఉండటంతో ముందుగా వెంటిలేటర్ అమర్చి, చికిత్స మొదలుపెట్టామని తెలిపారు. తర్వాత అసలు ఏం జరిగిందని ఆరా తీయగా అర్ధరాత్రి 2 గంటల సమయంలో బాబుకు తీవ్రంగా కడుపునొప్పి వచ్చింది. తర్వాత వాంతులు కావడం మొదలుపెట్టాయి. తెల్లవారు జామున గంటల సమయంలో గొంతు కూడా నొప్పి అనిపించడంతో స్థానికంగా ఉన్న ఒక ఆస్పత్రికి తీసుకెళ్లారు. లక్షణాలు చూసిన అక్కడి వైద్యులు పేగుల్లో ఏదో సమస్య అయి ఉంటుందని భావించి, అందుకు సంబంధించిన మందులు ఇచ్చారు. తర్వాత కొన్ని గంటల పాటు బాగానే ఉన్న బాబుకు.. ఆ తర్వాత ఊపిరి అందని పరిస్థితి ఏర్పడింది. దాంతో వెంటనే కిమ్స్ సవీరా ఆస్పత్రికి తరలించారు. ఈ లక్షణాలన్నీ చూస్తే తప్పనిసరిగా బాబును పాము కాటేసి ఉంటుందన్న నిర్ధారణకు వచ్చాం. సాధారణంగా పాము కాటు వేస్తే నోటివెంట నురగలు రావడం, నరాలు చచ్చుబడిపోవడం లాంటి కొన్ని లక్షణాలు ఉంటాయి. కానీ, కొన్నిరకాల పాములు కాటు వేస్తే మాత్రం ఇలా ఉండకపోగా.. వేరే లక్షణాలు కనిపిస్తాయి. పాముకాటు అని నిర్ధారణ కావడంతో బాబుకు ముందుగా పాము విషానికి విరుగుడు అయిన ఎఎస్‌వి (యాంటీ స్నేక్ వీనం) ఇంజెక్షన్లు ఇచ్చి, దాంతోపాటు కాల్షియం కూడా ఇవ్వడంతో రెండు రోజుల తర్వాత బాబు పూర్తిగా కోలుకున్నాడు. అతడి ఆక్సిజన్ శాచ్యురేషన్ కూడా సాధారణ స్థాయికి రావడంతో వెంటిలేటర్ తొలగించి, రెండు రోజుల్లోనే డిశ్చార్జి చేశామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలు ఎవరైనా కింద పడుకుని, లేవగానే తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతూ, ఆ తర్వాత ఇతర సమస్యలు కూడా మొదలైతే దాన్ని పాముకాటుగా అనుమానించి, వెంటనే తగిన చికిత్స అందజేయాలని సూచించారు. ఆలస్యమయ్యే కొద్దీ పరిస్థితి విషమిస్తుందని డాక్టర్ మహేష్ వివరించారు.


స్పీకర్, హోంమంత్రిని కలిసిన ఎమ్మెల్యే దగ్గుపాటి



స్పీకర్‌కు బొకే అందజేస్తున్న దగ్గుపాటి

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ శనివారం విజయవాడలో అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, హోంమంత్రి వంగలపూడి అనితను మర్యాదపూర్వకంగా కలిశారు. అసెంబ్లీ సమావేశాల అనంతరం వారిని కలిసి బొకే అందజేసి శాలువాలు కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా దగ్గుపాటి మాట్లాడుతూ రాష్ట్రంలో కేటాయించిన పదవులను చూస్తే చంద్రబాబు అనుభవం తెలుస్తుందన్నారు. ఆ పదవులకే ఒక కొత్త కళ వచ్చిందన్నారు.




అనితకు బొకే అందజేస్తున్న దగ్గుపాటి

సైనికపురం వద్ద బస్సులను ఆపాలని వినతి

ప్రజాశక్తి-అనంతపురం

కూడేరు మండలం గొట్కూరు పంచాయతీ పరిధిలో ఉన్న సైనికపురం వద్ద ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సులను నిలిపాలని కలిసి కెప్టెన్ షేకన్న, కెప్టెన్ పట్నం ఉమామహేశ్వరరావు కోరారు. ఈమేరకు శనివారం నగరంలోని ఎపిఎస్ ఆర్టీసీ డిపోలో మేనేజర్ నాగభూపాల్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నగరానికి 14 కిలోమీటర్ల పరిధిలో ఉన్న సైనికపురంలో ఎంతోమంది మాజీ సైనికులు, వీరనారులు జీవిస్తున్నారన్నారు. వారందరూ బస్సులు నిలకపోవడం వల్ల ఇటు అనంతపురం, అటు ఉరవకొండకు వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. మోటార్ సైకిళ్లలో ప్రయాణం చేస్తే తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని సైనికపురం వద్ద ఎక్స్‌ప్రెస్ ఆర్టీసీ బసులు నిలిపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇందుకు డిపో మేనేజర్ స్పందిస్తూ త్వరలో బస్సులు నిలిపేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సైనికులు బషీర్ అహ్మద్, మణికుమార్, బి.ఎ.హుస్సేన్, ఇస్మాయిల్ షఫీ, నరసింహులు, పెంచలయ్య, మహబూబ్ పీరా, ఇర్షాద్ అహ్మద్, నూర్ మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.



ఆర్టీసీ మేనేజర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న మాజీ సైనికులు

కీటక జనిత వ్యాధులను నివారిద్దాం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి-వజ్రకరూరు

కీటక జనిత వ్యాధులను నివారిద్దామని సిహెచ్ఓ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండి షఫీ అన్నారు. శనివారం ఉరవకొండ మండల పరిధిలోని నెరమెట్ల, రాయంపల్లిలో కిటక జనిత వ్యాధులపై అవగాహన అవగాహన కల్పించారు. అలాగే మలేరియా మాసోత్సవాల్లో భాగంగా మోపిడి, చిన్న ముష్టూరు గ్రామాల్లో మలేరియా, డెంగీ వ్యాధుల గురించి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. వైద్య సిబ్బందితో కలిసి ఆ గ్రామాలను సందర్శించి కీటక జనిత వ్యాధులపై వివరించారు. కాగా నీటినిల్వలు లేకుండా చూసుకోవాలని, నీటిని నిల్వ ఉంచిన బిందెలు, బానలు, డ్రమ్ములపై మూతలను వాడాలని సూచించారు. దోమ పుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. దోమతెరలు వాడడం, దోమలు చుట్టలు పెట్టుకోవడం, సాయంత్రం వేపాకు పొగ వేయడం వంటివి చేయాలన్నారు. చలితో కూడిన జ్వరం రావడం, చెమటలు పట్టి జ్వరం వదలడం లక్షణాలు కనిపిస్తే మలేరియాగా భావించి వైద్యులను సంప్రదించాలన్నారు. అనంతరం కిటక జనిత వ్యాధులపై అవగాహన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ శేఖర్, హెల్త్ అసిస్టెంట్ వెంకటేష్, సీఓ భగవాన్, దాస్, ఏఎన్ఎంలు సలీమా, లలిత, ఆశాలు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలి

ప్రజాశక్తి-వజ్రకరూరు



రెవెన్యూ ఇన్స్‌పెక్టర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఆర్ఎస్‌వైఎఫ్ నాయకులు

ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలని ఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా కన్వీనర్ చిరంజీవి, కో కన్వీనర్ భీమేష్ డిమాండ్ చేశారు. శనివారం ఆర్ఎస్‌వైఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2018లో టిడిపి ప్రభుత్వం ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న పథకం భోజనం అమల్లోకి తెచ్చిందన్నారు. తద్వారా సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థులకు ఎంతో మేలు జరిగిందన్నారు. అయితే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిలిపివేసిందన్నారు. ప్రస్తుతం టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో తిరిగి ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా నాయకులు అనిల్, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



రాయదుర్గంలోని ఎమ్మెల్యే నివాసం వద్ద ఉన్న పశువుల మంద

ఎమ్మెల్యే నివాసం ముందు పశువుల మంద

రాయదుర్గంలో పశువులతో తీవ్ర ఇబ్బందులు

ప్రజాశక్తి-రాయదుర్గం

రాయదుర్గం ఎమ్మెల్యే కాలువ శ్రీనివాసులు నివాసం వద్ద శనివారం మధ్యాహ్నం రోడ్డుకు అడ్డంగా పదులసంఖ్యలో పశువులు చేరాయి. ఎమ్మెల్యే ఇంటికి వెళ్లే వీధి, నేతాజీ రోడ్డుపై పశువులు భారీగా చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. దాదాపు పట్టణమంతా ఇదే పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. పశువుల యజమానులు స్వేచ్ఛగా వీధుల్లోకి వదలడం వల్లే ఈ పరిస్థితి దాపురిస్తోందని చెబుతున్నారు. ప్రధాన రహదారులు, కూడళ్లు, మార్కెట్లు, తదితర చోట్ల రోడ్లపై విధులకు అడ్డంగా ఉండి అంతరాయం కలిగిస్తున్నాయి. అయినప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఇదివరకూ స్థానిక గోరక్షక దళం మున్సిపల్ అధికారుల సాయంతో పశువుల యజమానులకు హెచ్చరికలు జారీ చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పట్టణంలో యథేచ్ఛగా రోడ్లపై పశువులను వదలకుండా యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అంజన్న ఆలయంలో ఎమ్మెల్యే తనయుడు పూజలు

ప్రజాశక్తి-పామిడి

మండలంలోని సొరకాయలపేట గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయంలో గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తనయుడు ఈశ్వర్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్నికల ముందు ఎమ్మెల్యేగా జయరామ్ గెలిస్తే 101 టెంకాయలు కొడతామని గ్రామస్తులు మొక్కుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తనయుడు ఈశ్వర్ శనివారం గ్రామానికి రావడంతో టెంకాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ముందుగా ఈశ్వర్‌కు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆంజనేయ స్వామి ఆలయంతోపాటు పీర్ల మకాణం, పెద్దమ్మ ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత ఆంజనేయస్వామి ఆలయంలో టెంకాయలు కొట్టి మొక్కుతీర్చారు. ఈ కార్యక్రమం లో పామిడి మండల, పట్టణ టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



టెంకాయలు కొడుతున్న ఎమ్మెల్యే తనయుడు ఈశ్వర్

అనుమతి లేని పాఠశాలపై చర్యకు డిమాండ్

ప్రజాశక్తి-వజ్రకరూరు

ఉరవకొండలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ది ఎడిసన్ పాఠశాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ ఉరవకొండ మండల అధ్యక్షులు హరుణ్ రషీద్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎంఇఒ-2 రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి విద్యార్థుల వచ్చే విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఫిట్నెస్ లేని బస్సులను వెంటనే సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ది ఎడిషన్ పాఠశాలకు అనుమతి లేకపోయినా నడుపుతున్నారన్నారు. దీనివల్ల విద్యార్థులు నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. కావున వెంటనే పాఠశాల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థి సంఘాలను కలుపుకుని ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు సురేష్, సాయి, మారుతి, అఖిల్, తదితరులు పాల్గొన్నారు.

పౌరసరఫరాల గోదాము తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ

గుత్తి : పట్టణంలోని పౌరసరఫరాల గోదామును ఆర్‌డిఒ శ్రీనివాసులురెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా స్టాక్ పాయింట్‌లోని రికార్డులను పరిశీలించారు. స్టోర్లు, అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేయాల్సిన నిత్యవసర వస్తువుల నిల్వలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి.భారతి, సిడిపిఒ డిల్లేశ్వరి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు

ప్రజాశక్తి-గుత్తి




సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ శ్రీనివాసులు

పురపాలక సంఘం పరిధిలో సీజనల్ వ్యాధులు నివారణకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం దృష్ట్యా డెంగీ, మలేరియా, డయేరియా వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆమెనిటీస్, శానిటేషన్, ఆరోగ్య కార్యదర్శులు పాల్గొన్నారు.

బిసివైపి అధ్యక్షుడిని కలిసిన ఎమ్మెల్యే అభ్యర్థి

ప్రజాశక్తి-రాయదుర్గం



అధినేతకు బొకే అందజేస్తున్న బిసివైపి నాయకులు గౌని ప్రతాప్‌రెడ్డి

బిసివై పార్టీ రాయదుర్గం అసెంబ్లీ అభ్యర్థి, రాయదుర్గం రైతు రక్షణ వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు గౌని ప్రతాపరెడ్డి శనివారం మంగళగిరిలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బోడె రామచంద్రయాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీ అధ్యక్షులు ఆహ్వానం మేరకు వెళ్లి కలిశానన్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో రాయదుర్గం నియోజకవర్గంలో బీసీవై పార్టీని విజయవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంతో సఫలమయ్యారని అభినందించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకళ్లడంతో పాటు నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించాలని సూచించినట్లు తెలిపారు.

విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-గుత్తి



విద్యార్థులకు సామగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం

మండలంలోని బేతాపల్లి గ్రామంలో ఉన్న జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుని మహాలక్ష్మి అధ్యక్షతన శనివారం ఉచితంగా విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ప్రొద్దుటూరు చెందిన ఎం.చంద్రశేఖర్‌రెడ్డి కుమారుడు ఎం.యువన్ చంద్రగణేష్ పుట్టినరోజు సందర్భంగా 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకూ చదువుతున్న 150 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు, పెన్నులు, మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చిన్న ఆంజనేయులు, ఎంపిటిసి ధనుంజయ ఉపాధ్యాయులు ఓబుళపతి, శివప్రసాద్, రవీంద్రనాథ్‌రెడ్డి, సుజాత, నరేంద్రనాథ్ గౌడ్, చంద్రకళ, నిరుపమ, రామకృష్ణయ్య, రత్నకుమారి, మాదన్న, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి

ఆర్‌డిఒ రాణిసుస్మిత

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

కస్తూరిబా గాంధీ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆర్‌డిఒ రాణిసుస్మిత సంబంధిత ఆదేశించారు. శనివారం కళ్యాణదుర్గం పట్టణంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా పాఠశాలలో నెలకొన్న కనీస సమస్యలు, మౌలిక సదుపాయాలపై చర్చించారు. అనంతరం మరుగుదొడ్లు, వంటగదిని పరిశీలించి స్థానికంగా పని చేస్తున్న ఉపాధ్యాయులు, వార్డెన్ నాగలక్ష్మికి పలు సలహాలు, సూచనలు అందజేశారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించే విషయంలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.



కస్తూరిబా గాంధీ పాఠశాలను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ రాణిసుస్మిత

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

మరో ముగ్గురికి గాయాలు



మృతిచెందిన విష్ణు

గుత్తి : మండలంలోని 44వ జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ బాలుడు మృతి చెందాడు. మరో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడులోని ధర్మపురికి చెందిన కార్తీక్, సత్య, మోహన్, విష్ణు (4) హైదరాబాద్‌కు ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా మండల పరిధిలోని కొత్తపేట – వన్నెదొడ్డి గ్రామాల మధ్య 44వ జాతీయ రహదారిపై అదుపుతప్పి వాహనం డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో విష్ణు అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడ్డ కార్తీక్, సత్య, మోహన్‌ను చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం అనంతపురం ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఘటనా స్థలాన్ని ఎస్ఐ బి.నబిరసూల్ పరిశీలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



వేసవి ప్రత్యేక సంచికను విడుదల చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు హిమశేఖర్

వేసవి ప్రత్యేక సంచిక విద్యార్థులకు వరం

బ్రహ్మసముద్రం : ప్రజాశక్తి రూపొందించిన వేసవి ప్రత్యేక సంచిక విద్యార్థులకు ఓ వరం లాంటిదని ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హిమశేఖర్ అన్నారు. శనివారం ఎరడికెర ఉన్నత పాఠశాలలో వేసవి ప్రత్యేక సంచికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాశక్తి సాహితీ సంస్థ విద్యార్థులు, ఉపాధ్యాయులు, సమాజ శ్రేయస్సు కోసం అలుపెరుగని కృషి చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే వేసవి ప్రత్యేక సంచికను తీసుకురావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎరడికెర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు కరీముల్లా, సుబ్రమణ్యం, శ్రీవాణి, సురేష్‌బాబు, రామ్మోహన్, సురేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ జైభీమ్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

అనంతపురం : ఆర్టీసీ జైభీమ్ రాష్ట్ర అధ్యక్షులు ప్రత్తిపాటి కిరణ్ బుజ్జి, రాష్ట్ర చీఫ్ ఎడ్వయిజర్ హెచ్.బాబన్న ఆధ్వర్యంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా నూలు దామోదర్, జిల్లా సెక్రటరీగా ఎం.వెంకటేశులు, జిల్లా కోశాధికారిగా కె.పి.పుల్లన్న, జిల్లా పబ్లిసిటీ సెక్రటరీగా ఓబయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎం.ఎర్రిస్వామిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర పబ్లిసిటీ సెక్రటరీ సుధాకర్, జోనల్ నాయకులు ఎస్.ముత్యాలు, సీనియర్ నాయకులు నాగన్న, ధర్మవరం డిపో సెక్రటరీ మన్యం, తాడిపత్రి డిపో సెక్రటరీ రాముడు, కళ్యాణదుర్గం డిపో సెక్రటరీ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న అయ్యప్ప స్వామి భక్తులు

పామిడి : పట్టణంలోని 44వ జాతీయ ప్రధాన రహదారిపై ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో అయ్యప్ప సేవాసమితి శనివారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా గురుస్వాములు స్వామినాథరెడ్డి, కొండూరు సుధాకర్, రవి మాట్లాడుతూ ప్రతి శనివారం అయ్యప్ప స్వామి ఆలయంలో అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ప్రసాద్ స్వామి, అయ్యప్ప భక్తులు వెంకట్, పరమేశ్వర్, బాబురావు, గ్యాస్ బాలాజీ, నాగేంద్ర, శంకర్రావు, చరణ్, బంగారు మహేష్, తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి ఎమ్మెల్యేను కలిసిన 'కాపు'


రాయదుర్గం : రాయదుర్గం మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయనిని శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



ఎమ్మెల్యే బేబినాయనితో మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి

ఉద్యోగ విరమణ

రాయదుర్గం : గుమ్మగట్ట మండలం గొల్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పని చేసి పదవీ విరమణ పొందిన జిహెచ్.శివశంకర్‌ను శనివారం ఘనంగా సత్కరించారు. ప్రధానోపాధ్యాయులు మురహర ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభినందన సభలో శివశంకర్ చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడు శివశంకర్ దంపతులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

'అనంత' అభివృద్ధి పయనం సాగేనా..?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



నిత్యం కరువుకు నిలయమైన ఉమ్మడి అనంతపురం జిల్లా సమస్యలపై కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వమైనా దృష్టి సారిస్తుందా.. అన్నది చర్చనీయాంశంగా మారింది. ఈవారంలో ఎమ్మెల్యేగా ఎన్నికైన నేతలందరూ అసెంబ్లీలో ప్రమాణస్వీకారాలు చేశారు. ఉమ్మడి జిల్లాలో ప్రజలు ఏకపక్షంగా తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. 13 మంది ఎమ్మెల్యేలు, ఒక బిజెపి ఎమ్మెల్యే కలిపి కూటమియే వంద శాతం విజయం సాధించింది. అందరూ కలసి ఈ జిల్లా వెనుకబాటుతనానికి పరిష్కారాలు ఏ మేరకు వెతుకుతారనేది చూడాల్సి ఉంది. ఎందుకంటే ప్రతిపక్ష పార్టీకి సంబంధించి ఏ ఒక్కరూ లేకుండా ఉన్న ఈ కొత్త ప్రభుత్వంలో సమస్యలను చట్టసభల్లో లేవనెత్తేవారుండరు. ఇది ఒకవైపు అయితే.. ఆ పార్టీలు అనకుంటే సమస్యలను పరిష్కరించడానికి పెద్దగా అడ్డంకులు ఉండే అవకాశాల్లేవు. మంత్రివర్గ విస్తరణలోనూ ఉమ్మడి జిల్లాకు మంచి ప్రాధాన్యతనే లభించింది. ఉరవకొండ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు ఆర్థిక మంత్రికాగా, ధర్మవరం బిజెపి ఎమ్మెల్యే సత్యకుమార్‌కు వైద్యఆరోగ్య శాఖనిచ్చారు. ఇక పెనుకొండ ఎమ్మెల్యే సవితకు బిసి సంక్షేమ శాఖను అప్పగించారు. ఇలా మూడు ప్రధానమైన పోర్టుపోలియోలే జిల్లాకు దక్కాయి. అన్ని విధాలుగా అనుకూలమైన పరిస్థితులు నెలకొన్న తరుణంలో వెనుకబడిన అనంతపురం జిల్లా అభివృద్ధిని ఏ రకంగా ముందుకు తీసుకెళ్తారన్నది చూడాల్సి ఉంది. అనేక సమస్యలు జిల్లాలో ఉన్నాయి. ప్రధానమైన వ్యవసాయాధారిత జిల్లాగా ఉన్న ఇక్కడ వర్షపాతం అతి తక్కువగా ఉంటోంది. 2023లో తీవ్ర వర్షాభావంతో రైతులు పంటలు కూడా సాగు చేసుకోలేకపోయారు. ఆ పంట నష్టానికి సంబందించి బీమా కూడా ఇప్పటి వరకూ రాలేదు. ఇక రబీలోనూ కరువు మండలాలే ఏర్పడ్డాయి. ఆ కరువును పరిశీలించేందుకు కరువు బృందం కూడా ఈ వారంలోనే పర్యటించింది. దీని సాయం ఎప్పటికి అందుతుందో తెలియదు. ఇంతలోనే ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. వర్షాలు కొంత ఆశాజనకంగానే ఉన్నప్పటికీ ఇంకా సీజన్ చాలా సమయముంది. వచ్చేనెలలో ఏరకంగా వానలుంటాయో తెలియదు. ఎందుకంటే జిల్లాలో సాగయ్యేది అత్యధికంగా వర్షాపాతం ఆధారంగానే వ్యవసాయం ఉంటుంది. అన్ని నెలల్లోనూ వర్షాలు బాగా పడితేనే రైతుకు పంట దక్కుతుంది. లేకపోతే నష్టపోకతప్పని పరిస్థితులున్నాయి. ఇక జిల్లాకు సాగునీటిని అందించే ప్రధానమైన వనరులు హంద్రీనీవా, తుంగభబద్ర ఎగువ ప్రధాన కాలువ. ఈ రెండింటికి ఇప్పట్లోనే నీళ్లు వచ్చే అవకాశాలు చాలా తక్కువగానే ఉన్నాయి. ఎందుకంటే వీటిని నీటిని అందించే తుంగభద్ర డ్యామ్, శ్రీశైలం డ్యామ్‌ల్లో నీళ్లు లేవు. ఒకవేళ వచ్చినా తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ పరిస్థితి అధ్వాన్నంగా ఉంది. తక్షణం మరమ్మతులు చేపట్టాలన్నా రూ.12 కోట్ల వరకు నిధులు అవసరమవుతాయని అధికారులు అంచనాలు వేశారు. ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపించారు. గడిచిన ఐదేళ్లలో కనీస మరమ్మత్తులు నోచుకోలేదు. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం ప్రధానంగా తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ ఆధునీకరణ పూర్తి చేయాల్స ఉంది. ఉమ్మడి జిల్లాకు సాగు,తాగునీటిని అందించే అత్యంత ప్రధానమైన నీటి వనరు తుంగభద్ర ఎగువ ప్రధాన కాలువ. ఇక కొత్త ప్రభుత్వం జిల్లా పారిశ్రామికీకరణపైనా దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు. గత టిడిపి ప్రభుత్వ హయంలో తీసుకొచ్చిన కియా పెద్ద పరిశ్రమగా ఉంది. ఇలాంటి మరిన్ని పరిశ్రమలొస్తే స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని జిల్లావాసులు ఆకాంక్షిస్తున్నారు. ఈ ఆకాంక్షలను కొత్త ప్రభుత్వం ఏ మేరకు తీరుస్తుందో చూడాల్సి ఉంది.